క్లుప్తంగా

సంతాపం

పాలకొండ రూరల్: మండలంలోని చింతాడ గ్రామ మాజీ సర్పంచ్ మెరగల చంద్రినాయుడు(53) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు తమ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

కొమరాడ: మండల కేంద్రంలోని కొట్టు మధ్య నాగావళి నదీతీరం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీలతో భారీ ఇసుక తవ్వేస్తున్నారని, దీంతో నదీగర్భంలో లోతైన ప్రదేశాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాపై దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ మరిచారు..


వండువ జంక్షన్‌లో కొత్తగా వేసిన స్పీడు బ్రేకర్లు

వీరఘట్టం: వీరఘట్టం–పాలకొండ సీఎస్‌పీ రహదారిలో వండువ నుంచి నవగాం వరకు మరమ్మతులకు గురవడంతో ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మించారు. వండువ జంక్షన్ వద్ద స్పీడు బ్రేకర్లు వేశారు. అయితే ఈ జంక్షన్‌లో స్పీడు బ్రేకర్లు ఉన్నట్లు ద్విచక్ర వాహనదారులు గుర్తించలేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ స్పీడు బ్రేకర్లు ఇక్కడ ఉన్నట్టు వాహనదారులు గుర్తించేలా రేడియం పెయింటింగ్ వేయాలని వాహనదారులు కోరుతున్నారు. లేదంటే ఇక్కడ మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు అంటున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి సారించాలని వీరంతా కోరుతున్నారు.

సమన్వయంతోనే నగర పంచాయతీ అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: పాలకవర్గం, సభ్యులు సమన్వయంతో పని చేయడం ద్వారా నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై ప్రస్తావించారు. స్థానిక ఎమ్మెల్సీకి సమావేశానికి ఆహ్వానం పంపక పోవడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ రత్నంరాజు కార్యాలయ మేనేజర్ తనను తప్పుదోవ పట్టించారని, తాను కొత్తగా బాధ్యతలు చేపట్టడంతో ఇలా జరిగిందని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఎమ్మెల్సీని పిలవాల్సి ఉందా, లేదా అన్న విషయాన్ని మున్సిపల్ చట్టంలో తెలుసుకుని ఆ ప్రకారం చేయాలని కమిషనర్‌కు ఆదేశించారు. అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న బాబూరావును పారిశుధ్య కార్మికునిగా మార్పు చేయడం కోసం పెట్టిన తీర్మానాన్ని సభ్యులు తిరస్కరించారు. నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుల జాబితాలో విధుల్లో చేరిన వారు ప్రస్తుతం ఆ విభాగంలో పని చేయడం లేదని దీంతో పట్టణంలో పారిశుధ్య సమస్య వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సూపర్‌వైజర్లు ఎక్కువగాను, పనిచేసే వారు తక్కువగాను ఉన్నారని తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, గంటా సంతోష్, కడగల రమణ, కోడెం విజయ్‌కుమార్, బాసూరు కాంతారావు, తుమ్మగుంట శంకరరావు, కొరికాన గంగునాయుడు, తూముల లక్ష్మణరావు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే ఖబడ్దార్..!

పార్వతీపురంటౌన్: తూనికలు, కొలతల్లో తేడా వస్తే కఠినంగా వ్యవహరిస్తామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రత్నరాజు హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఐరన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి వినియోగ దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. దుకాణాల్లో తూనికలు, కొలతల విషయంలో తేడా ఉన్నట్లు అనుమానం వచ్చినట్లైతే తక్షణమే తమకు ఫిర్యాదుచేయాలని సూచించారు.


● నిర్మానుష్యం...

ఎండల తీవ్రత ఎక్కువైంది. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప రోడ్ల మీదకు రావడం లేదు. వీరఘట్టంలో శుక్రవారం ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరిగి 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. మధ్యాహ్నం 12 గంటలకు 42 డిగ్రీలకు చేరుకుంది. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే వీరఘట్టం ప్రధాన రహదారి జనం లేక బోసిపోయింది. అదే ఈ చిత్రం. – వీరఘట్టం


● శిథిలావస్థలో విశ్రాంతి భవనం

గుమ్మలక్ష్మీపురం మండలం, టిక్కబాయి గ్రామ జంక్షన్ వద్ద ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబ్, గోడలు పెచ్చులూడిపోతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనగా, ప్రయాణికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపైనే నిల్చొని వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి, కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –గుమ్మలక్ష్మీపురం


● లారీ ఎక్కిన ఓడ

సముద్ర జలాల్లో పయనం సాగించాల్సిన ఓడ లారీపైకి ఎక్కి ప్రయాణం సాగించడం చూపరులను ఒకింత ఆకర్షించింది. కళింగపట్నం సముద్ర తీరం నుంచి తారాస్ లారీలో నాటు పడవ భామిని మండలంలోని నేరడి బీ వంశధార నదీ తీరానికి శుక్రవారం చేరింది. ఈ మార్గంలో దీన్ని చూసిన వాహన చోదకులు, పాదచారులు ఆసక్తిగా దీన్ని తిలకించారు. – భామిని

హెల్మెట్ ధారణ..
ప్రాణానికి రక్షణ!



- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి
- హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి. రోడ్లుపైకి వాహనాలతో వచ్చేటప్పుడు ద్విచక్ర వాహనదారులైతే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రమాద సమయంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంచెం దూరమని కొంతమంది హెల్మెట్ పెట్టడం మానేస్తుంటారు. ఇలా చేసినప్పుడు ఏదైనా ప్రమాదం బారినపడి మృత్యువాత పడితే అయ్యో హెల్మెట్ పెట్టి ఉంటే బాగుణ్ణే బతికేవాడు అనే మాటలు వినిపిస్తుంటాయి. ఏదిఏమైనా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి రోడ్డు మీదికి వస్తేనే వారి ప్రాణాలకు రక్షణ.

బరువని నిర్లక్ష్యం వద్దు..

కొంతమంది హెల్మెట్‌ను వెంట తీసుకువెళ్లడం పెద్ద బరువుగా భావించి ఇంటి వద్దనే వదిలేస్తుంటారు. అలా చేయడం సరికాదు. హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తూ కోర్టులు కూడా హెచ్చరికలు చేసిన సందర్భాలు ఉన్నాయి. బైక్ నడిపిన వ్యక్తి హెల్మెట్ ధరించాలని, వీలైతే బండి వెనక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తే బాగుంటుందని తెలిపాయి. ఈ నేపథ్యంలో పోలీసులను అప్రమత్తం చేసి, వాహనదారులకు అవగాహన కల్పిస్తోంది. రంగంలోకి దిగిన పోలీసులు, గ్రామాలు, పట్టణాలు, ప్రధాన రోడ్లు, జంక్షన్లు అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ వాహనదారులకు హెల్మెట్ ధారణపై చైతన్యం చేస్తున్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకు రావాలని సూచిస్తున్నారు.


మూలిగూడ జంక్షన్ వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

హెల్మెట్ ధరించకుంటే జరిమానా..

పోలీసుల ముమ్మర తనిఖీల్లో ఎక్కడైనా ఏ ద్విచక్ర వాహనదారుడైనా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వారిని గుర్తించి, పోలీసులు జరిమానా విధిస్తున్నారు. ముఖ్యంగా పాత చలాన్లు వారితో కట్టించి, బాధ్యతను గుర్తు చేస్తున్నారు. రెండు మూడుసార్లు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి శిక్షలు కఠినతరం చేశారు. ఇదంతా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను తెలియజేయడం కోసమే అయినా ఎవరూ అంతగా పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

హెల్మెట్ సురక్షితమని గుర్తించాలి..

హెల్మెట్ ధారణ సురక్షితమని వాహనదారులు గుర్తించాలి. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తున్నాం. హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత అని పదేపదే గుర్తు చేస్తున్నాం. హెల్మెట్ ధరిస్తూ వాహనాలు నడుపుతున్న వారిని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నాం. ఇదంతా చేసినా ఎవరూ అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. వ్యక్తి తనకు తానుగా తెలుసుకుంటేనే మార్పు సాధ్యం.

–పి.నారాయణరావు, ఎస్‌ఐ, కురుపాం

రోడ్డెక్కితే ర్యాష్ డ్రైవింగ్..

రోడ్డెక్కితే చాలు ర్యాష్ డ్రైవింగ్‌లే కనిపిస్తాయి. మితిమీరిన వేగం, అడ్డదిడ్డంగా వాహనాలు నడపడం వంటి దృశ్యాలు తారసపడుతూనే ఉంటాయి. ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారి మాట అటుంచితే వారి నిర్లక్ష్యం కారణంగా బాధ్యతారాహిత్యం కారణంగా బుద్ధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరం. బైకులపై అతివేగంగా వెళ్తున్న వారిపై, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఇంకా కఠినతరం చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వజ్రోత్సవ వేడుకలకు స్థల పరిశీలన

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ స్థాపించి 75 ఏళ్లు పూర్తవుతున్నందున ఈ ఏడాది జూన్ 8న వజ్రోత్సవ వేడుకలు నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. 1969 నుంచి 2020 వరకు ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల నిర్వహణ కోసం శుక్రవారం ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు హైస్కూల్ క్రీడా మైదానంలో స్థల పరిశీలన చేశారు. స్టేజీ డెకరేషన్, అతిథులను ఆహ్వానించడం, కుటుంబ సభ్యులతో వచ్చే పూర్వ విద్యార్థులకు ఆతిథ్యం ఇవ్వడంతో పాటు తమకు విద్యా బుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించడం తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

జియ్యమ్మవలస: స్థానిక పోలీస్‌స్టేషన్ సహా చినమేరంగి పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల్లో ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయా స్టేషన్‌ల రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఫిర్యాదుదారు ఇచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఐ తిరుపతిరావు, ఎస్‌ఐ అనీష్ తదితరులు ఉన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

దివ్యాంగ చిన్నారులను భవిత కేంద్రంలో చేర్పించండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): దివ్యాంగ చిన్నారులను భవిత కేంద్రంలో చేర్పించాలని ఐఈఆర్‌టీలు ఎం.గౌరీశ్వరి, ఎస్.శ్రీదేవిలు కోరారు. ఇదే విషయమై వారు కురుపాంలో అడ్మిషన్ డ్రైవ్ శుక్రవారం చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి దివ్యాంగ పిల్లలున్న ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. భవిత కేంద్రంలో దివ్యాంగ బాలలకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. కేంద్రంలో అందించే ఫిజియోథెరపీ సేవలతో పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.


భవిత కేంద్రం సేవలను వివరిస్తున్న ఐఈఆర్‌టీలు

ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై విచారణ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని డంగభద్ర పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వావిలపల్లి శ్రీకాంత్ పనితీరుపై అధికారులు అదే గ్రామంలో శుక్రవారం విచారణ చేపట్టారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్.. వారానికి ప్రతి వేతనదారుడి దగ్గర నుంచి రూ.100లు, పనికి హాజరుకాని వారి నుంచి రూ.200లు వసూలు చేసినట్లు అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీవో కె.ధర్మారావు, ఏపీవో తులసీదాస్‌లు ఆ గ్రామానికి పోలీస్‌బందోబస్తుతో వెళ్లి, ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు పలువురు వేతనదారులను విచారణ చేసి, వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి, తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారణ చేస్తున్న అధికారులు

ముక్కు మూసుకోవాల్సిందే...

పాలకొండ రూరల్: పట్టణంలో పలు వీధి కూడళ్ల వద్ద పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అడుగు తీసి అడుగు వేయాలంటే మురుగు కూపాలను దాటి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. గడిచిన మూడు రోజులుగా స్థానిక వీవర్స్ కాలనీ సమీపంలో, శెడిగి వీధి కూడలి, మేదరవీధి, కోమటిపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇలా పలు కూడళ్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోటవంతో అటుగా రాకపోకలు సాగించే వారు ముక్కు మూసుకుంటున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కూడా పడుతుండడంతో ఈ వ్యర్థాలు తడిసి దోమలు, దుర్గంధం రావటంతో తమ ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. పట్టణ పరిశుభ్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వీవర్స్ కాలనీ సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు

దోమల నివారణ మందు పిచికారీ

గుమ్మలక్ష్మీపురం:

మండలంలోని కొత్తగూడ, జొల్లగూడ గ్రామాలతో పాటు కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ మందు శుక్రవారం పిచికారీ చేశారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల మందు స్ప్రే చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను, ఆరోగ్య సహాయకులు ఎస్‌వీ ప్రకాష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో దోమల మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

చెరువుల అభివృద్ధికి నిధుల మంజూరు

గరుగుబిల్లి: మండలంలోని 8 పంచాయతీల్లోని మొత్తం 11 చెరువుల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.76 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఇదే విషయమై ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్దవోలు మల్లినాయుడు చెరువుకు రూ.5 లక్షలు, ఉద్దవోలు తారకరామ చెరువుకు రూ.5 లక్షలు, గరుగుబిల్లిలోని గున్రన్నచెరువుకు రూ.5 లక్షలు, పెద్దూరులోని దక్షిణాయుని చెరువుకు రూ.10 లక్షలు, బీవీపురం దొర చెరువుకు రూ.10 లక్షలు, చినగుడబలోని కోనం చెరువుకు రూ.5 లక్షలు, బీవీపురం మండలవాని చెరువుకు రూ.5 లక్షలు, ఎస్ఆర్ పేట గంగసాగరానికి రూ.8 లక్షలు, వల్లరగుడబలోని కృష్ణసాగరానికి రూ.10 లక్షలు, కొంకడివరంలోని బోడివాని చెరువు ఫీడర్ చానల్‌కు రూ.8 లక్షలు, కొంకడివరంలోని గదబ కోనేరు చెరువుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

అధ్వానంగా వన్ వే రహదారి


అధ్వానంగా వన్ వే

వీరఘట్టం: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి బీఎంఆర్ సినిమా హాల్ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు 350 మీటర్ల పొడవునా ఉన్న ఈ రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతో పాదచారులు, వాహనచోదకులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు మురుకు కాలువలను ఆక్రమంచేశారు. దీంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీరఘట్టం – విశాఖపట్నం బస్సు నడపాలి

వీరఘట్టం:

వీరఘట్టం మండల కేంద్రం నుంచి విశాఖపట్నానికి డైరెక్ట్ బస్సు నడపాలని మండలానికి చెందిన ప్రయాణికులు కోరుతున్నారు. ప్రతీ రోజు వీరఘట్టం నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు వైద్య చికిత్సల కోసం ఇంకొందరు ప్రతీ రోజు పదుల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడ నుంచి విశాఖపట్నం వెళ్తున్నారు. గత్యంతరం లేక కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. కొందరు పాలకొండ, శ్రీకాకుళం మీదుగా విశాఖపట్నం వెళ్తున్నారు.

ఇంకొందరు పార్వతీపురం వెళ్లి అక్కడి నుంచి ట్రైన్‌లో విశాఖ వెళ్తున్నారు. ఇలా ప్రతీ రోజు ప్రయాణికులు ఆపసోపాలు పడుతూ విశాఖ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి విశాఖపట్నానికి వీరఘట్టం నుంచి డైరెక్ట్ బస్సు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టుదలతో చదివి విజయం సాధించాలి

సీతంపేట:

టెన్త్ పరీక్ష తప్పామని నిరుత్సాహ పడకుండా పట్టుదలతో చదివి విజయం సాధించాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి తప్పిన విద్యార్థులకు ఇస్తున్న సప్లిమెంటరీ కోచింగ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థులకు సందేహం ఉన్న పాఠ్యాంశాలను మళ్లీ బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఏపీజీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సీతంపేట: పాలకొండ ఏపీజీఈఏ తాలుకా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక సీతంపేట సామాజిక భవనంలో శుక్రవారం జరిగింది. అధ్యక్షులుగా బబ్బురు గణేష్, కార్యదర్శిగా పి.రాంజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా జిల్లా నాయకులు నూతలపాటి భరత్ భూషణ్ వ్యవహరించారు. రాష్ట్ర పరిశీలకులు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామచంద్రరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ నాయకులు కె.శంకరరావు, సింహాచలం, వై.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● డెంగీని నిర్మూలిద్దాం..


భామిని: బాలేరు వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్య, మలేరియా నివారణ శాఖ సిబ్బంది


వీరఘట్టం: ర్యాలీ చేస్తున్న వీరఘట్టం పీహెచ్‌సీ సిబ్బంది

జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. డెంగీ జ్వరం లక్షణాలు, దానికి కారణమైన దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను సిబ్బంది వివరించారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


గరుగుబిల్లి: ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది